## రంజని - నందివాడ భీమారావు కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# చెమ్మ

**"మీ**కు తెలుసా? మన స్కూలు 1916లో స్థాపించబడింది. అప్పట్లో మొత్తం తాలూకాలో మనదే మొట్టమొదటి స్కూలు. చుట్టు పక్కల ఇరవై కిలోమీటర్ల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకునేవారు. ఆ స్కూల్లో చదివామంటే చాలు ఎంతో గౌరవంగా చూసేవారు. స్కూలు స్టాండర్డు అంత గొప్పగా ఉండేది. అక్కడ చదివిన ఎందరో స్వాతంత్రోద్యమంలోనూ కమ్యూనిస్టు ఉద్యమాల్లోనూ పాల్గొని ఖ్యాతి గాంచారు. పూర్వపు ప్రముఖ కవులు ఇద్దరు ఆ స్కూల్లో ఉపాధ్యాయులుగా పని చేసిన వారే. ఆ స్కూలు మన జీవితాల్లో మరపురాని, మరచిపోకూడని భాగం. వందేళ్ళు పూర్తైన సందర్భంగా మనమంతా స్కూలు జ్ఞాపకాలని గుర్తు చేసుకుందాం"

ఫేస్‌బుక్‌లోని మా హైస్కూలు పూర్వ విద్యార్థుల గ్రూపులో శంకర్రావు పెట్టిన పోస్టింగు చూసి ఉలిక్కిపడ్డాను.

నేను చదివిన స్కూలు రూపం కళ్ళ ముందు కదిలింది. నాటి చదువులు, ఆటలు, పాటలు, నాటకాలు, అల్లర్లు అన్నీ గుర్తొచ్చాయి. మనస్సులో మధుర భావనలు గుబాళించాయి.

వెంటనే పోస్టు పెట్టాను. "మనం ఎక్కడెక్కడో ఉన్నాం. ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్నాం. అయినా మన పునాది రాళ్ళు అదిగో ఆ స్కూల్లోనే ఉన్నాయి. మనం మన జీవితాల్లో ఆ స్కూలు పోషించిన పాత్రని మరచిపోకూడదు. మనమంతా కలిసి వందేళ్ళ పండుగ ఘనంగా చేద్దాం. ఆ ఏర్పాట్ల నిమిత్తం మనమంతా వచ్చే నెల పది, పదకొండు తారీఖుల్లో ఆ స్కూల్లోనే కలుద్దాం. ఆ రెండు రోజులూ సెలవు దినాలు గనుక రావడానికి ఎవరికీ ఇబ్బంది ఉండదనుకుంటాను. ఒక్కసారి మన స్కూలు యొక్క ఘనచరిత్రని అందరికీ గుర్తు చేసి స్కూలు ఋణాన్ని కొంతైనా తీర్చుకుందాం"

ప్రతి స్పందన చాలా బాగుంది. మేమొస్తామంటే మేమొస్తామని జవాబిచ్చారు.

"ఆ స్కూల్లో చదివి, అత్యున్నత స్థానాల్లోకి వెళ్ళిన వారి ఫోటోలూ వివరాలతో ఒక సావనీర్‌ని తీసుకొస్తే యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుంది" ఒక రిటైర్డ్

ఐఎఎస్ అధికారి సూచించారు.

"అందులో మన అనుభవాలూ జ్ఞాపకాలూ రాద్దాం" ప్రతిపాదించారింకొకరు.

ఏ వయస్సులో ఉన్నా సరే బాల్యం గుర్తు వస్తే చాలు, పెదాల మీద చిరునవ్వు చిందులేస్తుంది. నాటి ఊహలు ఆలోచనలు కలలు భావాలు జ్ఞాపకాలు ముంచెత్తుతాయి. ఆనందోద్విగ్నుల్ని చేస్తాయి.

నా మిత్రులకే కాదు, తెలిసిన సీనియర్లకీ జూనియర్లకీ తప్పక రమ్మంటూ ఫోన్లు చేశాను.

అనుకున్నట్టుగానే పదవ తారీఖున వివిధ ప్రదేశాల్లో కలుసుకుని మూడు బృందాలుగా ఆ ఊరు వెళ్ళాం. ఆ ఊళ్ళో బంధువులున్నవాళ్ళు ఆసరికే వచ్చి ఉన్నారు.

అంతా ఒక రకమైన ఉద్విగ్న స్థితికి లోనవుతూ మొత్తం 15 మందిమి స్కూలు దగ్గరికెళ్ళాం.

హఠాత్తుగా మా కాళ్ళు ఆగిపోయాయి. కళ్ళెదుట కనిపిస్తున్న కఠిన వాస్తవాన్ని అపనమ్మకంగా ఆశ్చర్యంగా మ్రాన్పడి చూశాం.

మాకు అక్షరభిక్ష పెట్టిన విద్యాలయం ఒక బిచ్చగత్తెలా హీనంగా దీనంగా ఉంది. శిథిలాలయంలా ఉంది. మేం ఆడుకున్న స్థలమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉంది. మా కళ్ళనుండి కన్నీళ్ళు జలజల రాలాయి. 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు' - అని వాపోయాం.

"ఇందులో ఇంకా స్కూలు నడుస్తోందిగా. మరి, ఇంత దారుణంగా ఉందేమిటి పరిస్థితి?" రాంబాబు ప్రశ్నించాడు.

"ఇవాళో రేపో కూలిపోయేట్టుగా ఉంది" నిస్పృహగా అన్నాడు శామ్యూల్.

"అదిగో అటు చూడండి. స్కూలు గ్రౌండుని కబ్జా చేసి ఇళ్ళు కట్టేశారు" బషీర్ మాటలకు అదిరిపడ్డాం.

"ప్రైవేటు స్కూళ్ళూ కాన్వెంట్లూ వచ్చాక వీటి ప్రభ ఆరిపోయింది, ఇక దీని చరిత్ర ముగిసినట్టే" నిట్టూర్చింది ఉమ.

"అసలు లోపలి పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉందో. పదండి చూద్దాం" ఉత్సాహం నీరు కారిపోతోంటే అన్నాను.

స్కూలు నేమ్ బోర్డు ఓ పక్కకి ఒరిగి పోయి, సగం పేరు వెలసి ఉంది. ఇక బిల్డింగు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టుగా ఉంది. పైకప్పు మీది పెంకుల్లో చాలా వరకు విరిగిపోయాయి. చాలా చోట్ల వర్షం నీరు లీకై క్లాసు రూముల్లోకి వచ్చి పడినట్టు స్పష్టంగా తెలుస్తోంది. పగుళ్ళు తీసిన గోడలూ విరిగిన బల్లలూ కుర్చీలూ చూసి డీలా పడ్డాం. తలుపుల్లేని కిటికీలు వెక్కిరిస్తున్నాయి.

"మనం రాకుండా ఉండాల్సింది. ఈ దుస్థితి చూశాక పాత రూపాన్ని పాత

రోజుల్ని తలచుకోవాలంటేనే భయమేస్తోంది" బాధగా అన్నాడు శంకరం.

"అప్పుడే కాదు ఇప్పుడూ మరుగుదొడ్లు లేవు చూడండి. పొదల చాటుకెళ్ళడానికి పాపం ఆడపిల్లలు ఎంత ఇబ్బంది పడుతున్నారో" ఉమ అంది.

"ఆపరేషన్ బ్లాక్ బోర్డు అనీ, ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టామనీ ప్రభుత్వం ఎన్నెన్నో ప్రకటనలు గుప్పించింది. తీరా చూస్తే వేసిన చోటే ఉండే గొంగళిలా ఉండిపోయింది!" అసహనంగా అన్నాడు శామ్యూల్.

మా గురించి ఎలా తెలిసిందో గాని ఒక పాతికేళ్ళ యువకుడు గబగబా మా దగ్గరికొచ్చాడు. తన పేరు ఆచార్యులనీ, ఆ స్కూల్లోనే తెలుగు పండితుడిగా పనిచేస్తున్నాననీ చెప్పాడు.

"ఇంత అధ్వాన్నంగా ఉందేవిటండీ. గ్రాంట్లు ఏమై పోతున్నాయి. టీచర్ల జీతాలు బాగా పెరిగాయిగా. అయినా స్కూలు పరిస్థితి ఇంత దారుణంగా ఉందేం?" ఇలా ఉండటానికి కారకుడు అతడే అయినట్టుగా 'కయ్' మన్నాను.

"ఎవరికి పుట్టిన బిడ్డరా వెక్కి వెక్కి ఏడుస్తోందీ-అన్నట్టు అయిపోయిందండి. ఎమ్మీవో, సర్పంచ్ ఎవరూ పట్టించుకోరండి. ఊళ్ళో కాన్వెంటు స్కూళ్ళొచ్చాయి. టౌన్నుంచి కార్పొరేట్ స్కూళ్ళ బస్సులొస్తున్నాయి. అంతా పోటీపడి మరీ ఆ సూళ్ళకి పంపించేస్తున్నారు. కేవలం కూలీ నాలీ చేసుకునే వారి పిల్లలూ, పేదవర్గాల వారి పిల్లలూ ఇక్కడ చదువుతున్నారు..."

"ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో కూలేలా ఉంది. ఇందులోనే క్లాసులు నడిపిస్తున్నారా?" ఉమ అడిగింది.

అవునంటూ తలాడిస్తూ అన్నాడు. "సుమారు వందమంది విద్యార్థులున్నారండి. బాగా ఉన్న రూముల్లో క్లాసులు పెడుతున్నాం..."

"ఇదివరకట్లో రిజల్ట్స్ టాప్‌లో వచ్చేవి. ఇప్పుడెలా వస్తున్నాయి?" అడిగాను.

చప్పరించాడు. "టెన్త్ యావరేజ్‌గా పాసవుతున్నారు. రెండేళ్ళనుంచి గణితం టీచర్ లేరు. సైన్స్ టీచరే గణితమూ బోధిస్తున్నారు"

తల పట్టుకున్నాం.

"ఇలాంటి స్కూలుకి సెంటెనరీ సెలబ్రేషన్స్ చేస్తే అంతా ముఖం మీదే నవ్వుతారు. పదండి వెళ్ళిపోదాం" అన్నాను.

"అలా అనకండి. మీరంతా పూనుకుంటే స్కూలు నిలబడుతుంది. ఇక్కడ పిల్లలున్నారు. చదువుకోవాలన్న తపన ఉంది. వారిలో ప్రతిభకీ కొదవలేదు. అంతా పేదసాదల పిల్లలండి. ఎవరొకరు పూనుకోకపోతే ఈ స్కూలుని మూసేస్తారు. దగ్గర్లోని మరో స్కూల్లో కలిపెయ్యడానికి ఆల్రెడీ ప్రయత్నాలు మొదలయ్యాయి. అప్పుడీ పిల్లలంతా రోడ్డున పడతారు. చదువూ సంధ్యా లేకుండా ఎందుకూ పనికిరాకుండా పోతారు...!"

కళ్ళ నీళ్ళ పర్యంతమైన ఆచార్యుల్ని చూసేసరికి మా కడుపుల్లో దేవినట్టుగా అన్పించింది.

ఇంకో ఊరి నుంచి కడుపు చేత బట్టుకొచ్చిన అతడే ఇక్కడి పిల్లల గురించీ వారి చదువుల గురించీ తాపత్రయ పడుతోంటే, ఇక్కడ చదివి ఎంతో పైకి వచ్చిన మేం ఏమీ పట్టనట్టు ఉండటం అన్యాయం కాదూ?

"ఇక్కడ చదివి కలెక్టర్లు అయిన వారున్నారు. మేనేజర్లూ జనరల్ మేనేజర్లూ అయిన వారున్నారు. వ్యాపార వేత్తలుగా రాణిస్తున్న వారున్నారు. విదేశాల్లో ఉన్నత స్థితిలో సెటిలైన వారున్నారు. కవులూ కళాకారులూ ఉన్నారు. ఒకరిద్దరు సినిమా నటులూ ఉన్నారు. మనకింత చేసిన పాఠశాలని, మన కాళ్ళ మీద మనం నిలబడేలా చేసిన స్కూలుని, దాని కర్మకి వదిలెయ్యడమంటే ఏంటో తెలుసా? కనీ పెంచిన తల్లి దండ్రుల్ని బిచ్చమెత్తుకుని బతకమని రోడ్డుమీదకి తరిమెయ్యడమే. ఇది మన చదువుకీ సంస్కారానికీ పరీక్ష. మనమంతా పూనుకుంటే పూర్వ వైభవం తిరిగి రాదూ?" ఆవేశపడ్డాను.

"సెంటిమెంటల్‌గా ఆలోచిస్తే నువ్వన్నది నిజమే, కాని ఈ పునర్నిర్మాణ కార్యక్రమ బాధ్యత ప్రభుత్వానిది. నాయకులది. వాళ్ళే పట్టించుకోనప్పుడు పూర్వ విద్యార్థులం మనం ఎంత వరకూ ఎగరగలం?" బషీర్ అన్నాడు.

"రెక్కలు చాస్తే కదా ఎంత ఎగరగలమన్నది తెలిసేది!" ఉమ అంది.

"అమ్మ ఒడి, ఊరు బడి, దేవుని గుడి మరచిపోకూడదన్నారు పెద్దలు" రాంబాబు అన్నాడు.

"అంటే అన్నారుగాని కళ్ళజోడు తీసేసి చూద్దాం. ఎండిన చెట్టులా ఉంది స్కూలు. దీనికి ఎన్ని నీళ్ళు పోసినా వృథాయే!" శామ్యూల్ అన్నాడు.

"కావొచ్చు. కాని మనం ఆ చెట్టు విత్తులమే. మనల్ని మనం ఈ భూమిలో విత్తుకొని పచ్చని చెట్టులై మొలకెత్తలేమా?" అన్నాను.

అంతా తలలెత్తి నావంక చూశారు.

"మళ్ళీ ఈ ప్రదేశం పచ్చని పూలతోటలా మారితే సంతోషమే. మీకు గుర్తుందా? అదిగో ఆ పక్కనే పెద్ద గులాబీ పొద ఉండేది. రోజూ ఎన్ని పూలు పూసేదో. వాటిని కోసి తలలో పెట్టుకోడానికి అమ్మాయిలమంతా పోటీపడేవాళ్ళం. సూర్యం మాస్టారు 'పుష్పవిలాపం' పాడాక మళ్ళీ ఒక్కళ్ళమూ ఒక్క గులాబీనీ కోయలేదు" సన్నగా నవ్వుతూ చెప్పింది ఉమ.

"ఆశీర్వాదం మాస్టారు రామసేతు గురించి చెప్పిన విషయాలు ఇప్పటికీ గుర్తున్నాయి" రాంబాబు అన్నాడు.

"నాకేమో డ్రిల్లు మాస్టారు ఉంగరం వేలితే నానెత్తి మీద వేసిన మొట్టికాయ ఇంకా గుర్తుంది" తల తడుముకుంటూ అన్నాడు బషీర్.

"ఆల్జీబ్రా గుండె గాభరా అనుకునేవాణ్ణి. ఇప్పుడు మ్యాత్స్ లెక్చరర్ని అయ్యానంటే అదంతా చక్రవర్తి మాస్టారు నాటిన బీజాలు మహత్యమే" అన్నాడు విస్సు.

మాలో నాటి ముచ్చట్లు మొలకెత్తాయి. మెల్లగా మా గుండెలు చదును చేసిన వరి పొలాలయ్యాయి.

"మనం ఏదోటి చెయ్యాలి. మనందరం బాగా సంపాదిస్తున్నాం. లైఫ్‌లో స్థిరపడ్డాం. అంచేత మనం మన స్కూలు కోసం ఎంతోకొంత వెచ్చిద్దాం" అన్నాను.

"మనమంతా గట్టిగా పూనుకుంటే ఇదేమంత అసాధ్యం కాదు గానీ, ఈ పనులన్నీ దగ్గరుండి మనమెక్కడ చేయించగలం?" శంకరం ప్రశ్నించాడు.

"హెడ్ మాస్టార్నీ అధికారుల్నీ కలిస్తే వారు ముందుకు రావచ్చుగా" అంది ఉమ.

ప్రధానోపాధ్యాయుడ్ని కలిసి మా అభిప్రాయాలు తెలియజేశాం. "ఇంకో ఒకటిన్నర ఏడాదిలో రిటైర్ అవబోతున్నాను. నాకీ పితకలాట ఇప్పుడెందుకు చెప్పండి. ఇలాగే కుంటనివ్వండి. నడచినన్నాళ్ళు నడుస్తుంది" అన్నాడు నిర్వికారంగా.

విద్యాశాఖ వారినీ, ఎమ్డీవోనీ కలిశాం. ఆర్థిక సాయం అందించలేమంటూ ముందే చేతులెత్తేశారు.

"మనసుంటే మార్గం అదే కనిపిస్తుంది. మన స్కూలుని పునరుద్ధరించడానికి మనమంతా సిద్ధమేనా అన్నది మొదట తేల్చాలి" అందరి వంకా కలయ జూస్తూ అన్నాను.

"గడ్డి పరకలు ఒక్కటైతే గజాన్నే బంధించగలవు. మీరంతా చేతులు కలిపితే ఈ స్కూలుకి పూర్వ వైభవం వచ్చి తీరుతుంది" ఆచార్యులన్నాడు.

"చేతులు కలుపుదాం" అంది ఉమ. పిడికిలి బిగించాడు శంకరం.

మెల్లగా అంతా సరే అంటే సరే అన్నారు.

ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాం. పూర్వ విద్యార్థుల దగ్గర్నుంచి చందాలు వసూలు చెయ్యాలని నిర్ణయించాం. స్థానికంగానూ, సమీప టౌన్లోనూ ఉండే ఇద్దర్నీ, ఆచార్యుల్నీ కలిపి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశాం.

కన్వీనర్‌గా నన్ను ఉండమని పట్టుబట్టడంతో అంగీకరించక తప్పలేదు.

స్కూలు, క్లాసు రూములు, ప్లే గ్రౌండు ఫోటోలు తీసి ఫేస్‌బుక్‌లో వాట్సాప్‌లో పోస్టు చేశాం. పాత విద్యార్థులందరికీ విజ్ఞప్తి చేశాం.

"మన ఊరి స్కూలు మనకి అక్షర సంపదనిచ్చింది. విజ్ఞానాన్నిచ్చింది. మన స్వప్న సౌధాల నిర్మాణానికి పునాది వేసింది. ఆ స్కూలు ఇప్పుడు దయనీయ స్థితిలో ఉంది. మనం స్కూలు ఋణాన్ని కొంతైనా తీర్చుకునే అవకాశం ఇప్పుడు వచ్చింది. రండి. చేతులు కలపండి. చేయూత నివ్వండి. మన స్కూలు కీర్తి ఇనుమడించేలా విద్యాజ్యోతి దేదీప్యమానంగా వెలిగేందుకు తోడ్పడండి"

మా కృషి ఫలించింది. దేశ విదేశాల్లోని ఎందరో పూర్వ విద్యార్థులు అపూర్వంగా స్పందించారు. ఈ కార్యార్థం ప్రత్యేకంగా ప్రారంభించిన బ్యాంకు ఖాతాకి డబ్బు రాసాగింది.

"స్పందన చాలా బావుంది. గ్రౌండ్ వర్క్ ప్రారంభించండి" అని పర్యవేక్షణ కమిటీ సభ్యులకి ఫోన్ చేశాను.

"సర్పంచ్ కోపంగా ఉన్నాడు. ఆయన ప్రమేయం లేకుండా ఇక్కడేం చెయ్యడానికి వీల్లేదని వీరంగం ఆడుతున్నాడు. మమ్మల్ని చెడ తిడుతున్నాడు" ఒకరు చెప్పారు.

"ఆయన హయాంలో ఊరి స్కూలు బాగుపడితే ఆ క్రెడిట్ ఆయనకే దక్కుతుంది కదా?"

"కీర్తి అంతా తనకే దక్కాలంటున్నాడు" అని ఒకరంటే, "ఆటస్థలాన్ని కొంత ఆల్రెడీ కబ్జా చేశాడు. మిగతాదీ కబ్జా చేయడానికి ముగ్గులు పెడుతున్నాడు. ఈ లోగా మీరు రంగప్రవేశం చేశారు. అందుకని చిందులు తొక్కుతున్నాడు" అన్నాడు ఆచార్యులు.

స్థానికుల సహకారం తీసుకోకపోవడం ఎంత తప్పో అర్థమైంది. వెంటనే నేనూ శంకరం వెళ్ళి సర్పంచిని కలిశాం.

"ఈ కార్యక్రమమంతా మీ ఆధ్వర్యంలోనే జరిపించాలని నిర్ణయించాం" అని పొగిడాం.

అతడు మెత్తబడ్డాడు. "ఆటస్థలంలో రెండెకరాలు నా భూమి కలిసిపోయింది. దాన్ని విడగొట్టెయాలి మరి"

"రెవెన్యూ డిప్యూటీ సెక్రటరీ మన స్కూలు విద్యార్థే. ఆయనకి చెప్పి రెవెన్యూ రికార్డులు తిరగేయిద్దాం. కొలతలు వేయిద్దాం. మీది మీకు చెందేలా చూద్దాం"

అతడు కంగారు పడ్డాడు. "వద్దొద్దులే. అవన్నీ తిరగతోడడం ఎందుకూ. ఇప్పుడెంత ఉందో దాన్ని పక్కా చేసేద్దాం. అందుకు ఒప్పుకుంటే నా పూర్తి సహకారం మీకుంటుంది"

ముఖాముఖాలు చూసుకున్నాం. అతడితోడి ఘర్షణ మా కాళ్ళకు అడ్డం పడి తీరుతుంది. అందుకని, పోయింది పోయినా మిగిలిందానికైనా అడ్డుకట్ట వేసి ఒబ్బిడి చెయ్యడం అన్ని విధాలా శ్రేయస్కరమనుకున్నాం.

"సరే. మీ మాటే మా మాట"

స్థానిక ప్రముఖుల్ని కలిశాం. పాఠశాల పునరుద్ధరణకు అన్ని విధాలా తోడ్పడమని అర్థించాం.

"ఇప్పుడిదంతా అవసరమా? ఇంత చేశాక సర్కారు బడిలో చదవడానికి ఎవరూ ముందుకు రాకపోతే అంతా దండగే కదా" అన్నారొకరు.

"దండగ కాకుండా చూడాల్సిన బాధ్యత గ్రామస్తులదే" అన్నాను.

"నా వంతు కృషి నేను చేస్తాను. తమ పిల్లల్ని ఈ స్కూలుకి పంపేలా తల్లిదండ్రుల్ని

ఒప్పిస్తాను" హామీ ఇచ్చాడు ఆచార్యులు.

స్కూలు కప్పు మార్చి, గ్రౌండ్ బాగుజేసి, కొత్త ఫర్నిచర్ తయారు చేయిస్తే సరిపోతుందని పథకం తయారు చేస్తోంటే జగన్నాథం వచ్చాడు. అతడూ మా స్కూలు పూర్వ విద్యార్థే. ఓ టీవీ ఛానల్లో పనిచేస్తున్నాడు.

"ఇంత మంచి కార్యక్రమానికి పబ్లిసిటీ ఉండాలి. అప్పుడది స్ఫూర్తిదాయకం అవుతుంది" అంటూ ముందుకొచ్చాడు. స్కూలు చరిత్రనీ, అక్కడ చదివి ప్రముఖులైన వారినీ, మా ప్రయత్నాన్నీ చిత్రీకరించి టీవీలో ప్రసారం చేయించాడు.

దానికి ఎవరూ ఊహించనంత గొప్ప స్పందన వచ్చింది. అనేక పత్రికలు ప్రత్యేక వ్యాసాలు రాశాయి. అక్కడ చదివిన ఎందరో, రిటైరైన వాళ్ళూ, వివిధ పదవుల్లో హోదాల్లో ఉన్నవారూ, వ్యాపారాలు చేస్తున్న వారూ, పరిశ్రమలు నడుపుతున్నవారు, డాక్టర్లూ ఇంజనీర్లూ 'మేము సైతం' అన్నారు. గత వందేళ్ళలో ఆ ప్రాంతంలో మా స్కూలు తీసుకొచ్చిన పెనుమార్పులు–ముఖ్యంగా ఉద్యోగ ఉపాధి విజ్ఞానరంగాల్లో– అర్థమయ్యాయి. విద్య యొక్క విశ్వరూపం మా కళ్ళ ముందు సాక్షాత్కరించింది.

ఇక ఫండ్స్ ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడ్డాయి. ప్రతివారూ ఇదో దైవకార్యంగా భావించి ముందుకొచ్చారు. 'యువ స్ఫూర్తి ట్రస్టు' ప్రారంభించాం. స్కూలుని దత్తత తీసుకున్నాం. కొన్ని కంపెనీలూ స్వచ్ఛంద సంస్థలూ భారీ విరాళాలు ప్రకటించాయి. ప్రభుత్వమూ అన్ని విధాలా తోడ్పడుతుందని ప్రకటించడమేగాక ఉపాధ్యాయ ఖాళీల్ని భర్తీ చేసేశారు.

మరి కొందర్ని కలుపుకుని మరింత పెద్ద కమిటీని రూపొందించాం. ప్లాన్లు మార్చాం. కొత్త భవనాలు లేచాయి. కొత్త ఫర్నిచర్ వచ్చింది. కంప్యూటర్ ల్యాబూ, సైన్స్ ల్యాబూ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబూ, డిజిటల్ లైబ్రరీ సిద్ధమయ్యాయి. స్కూలు గ్రౌండు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాం. కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్‌లకు అనుకూలంగా కోర్టులు ఏర్పాటు చేశాం. చక్కని మరుగుదొడ్లు, ఆహారశాల, సైకిల్ స్టాండ్ తయారయ్యాయి. ఒక మోడల్ స్కూల్లా రూపుదిద్దుకుంది. స్కూలు ముందు ఓపెన్ స్టేజ్ నిర్మించి సరస్వతీ విగ్రహం ప్రతిష్ఠించాం.

సెలవు రోజుల్లో స్థానిక యువకులే గాక పూర్వ విద్యార్థులూ వచ్చి శ్రమదానం చేయడం విశేషం కాదు మహత్తర విజయం.

ఆ ప్రాంతంలోని ఏ ప్రైవేటు పాఠశాలకూ లేనన్ని హంగులు మా స్కూలుకు ఏర్పడ్డాయి.

ప్రభుత్వం మా పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియాల్లో బోధనకు ఉత్తర్వులిచ్చింది.

చెట్టు పచ్చగా మారేసరికి పిట్టలు వచ్చి వాలినట్టు విద్యార్థుల చేరిక అనూహ్యంగా

పెరిగింది. చక్కని ప్రమాణాలతో గత కీర్తికి ఢోకా రాని విధంగా విద్యాబోధన ఉండేలా జాగ్రత్త వహిస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం.

"సంపాదించింది అంతా దాచుకోవాలనుకునే ఈ రోజుల్లో ఈ విద్యార్థులు చదివిన పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం" అంటూ నాయకులూ అధికారులూ పోటీపడి మరీ మమ్మల్ని ఆకాశానికెత్తేశారు.

ఒక్క ఏడాది ఆలస్యమైతేనేం గాక శతాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాం. సుమారు 500 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వారిలో విదేశాల్లో స్థిరపడిన వారూ ఉన్నారు. గతాన్ని నెమరు వేసుకుని మురిసిపోయారు. ఒక మంత్రి, ఎమ్మెల్యే, స్థానిక నాయకులూ వచ్చి మా కృషిని అభినందించారు. స్థానికులు సరేసరి. సైన్సు, మెడికల్ ఎగ్జిబిషన్లు కూడా ఏర్పాటు చేయడంతో పాఠశాలకు పండుగ కళ వచ్చింది.

ఆ స్కూల్లో చదివి ఉన్నతోన్నత స్థానాల కెదిగిన కొందర్నీ, రిటైరైన ఆ స్కూలు టీచర్లనీ సన్మానించి మమ్మల్ని మేం సన్మానించుకున్నట్టు అనుభూతించాం. జనంలో కొండంత స్ఫూర్తి నింపాం.

'ఇదిగో ఈ చారిత్రాత్మక పాఠశాలలోనే మేం చదువుకున్నాం' అనే గర్వానుభూతిని గుండెల్నిండా నింపుకున్నాం.

ఈ యజ్ఞంలో చిన్న సమిధ సమర్పించగలిగినందుకు మా అందరికీ కొండంత తృప్తిగా ఆనందంగా గర్వంగా ఉంది. మా చదువు, విజ్ఞానం సార్థకమయ్యాయన్న భావన మమ్మల్ని ఊపేస్తోంది. ఉద్విగ్నపరుస్తోంది.

మేమంతా వెనుదిరగబోతూ స్కూలు వంక ఆరాధనగా చూశాం.

ఇకనుంచి ఈ బడిగంటలు గణగణ మోగుతాయి. ప్రతి ఉదయం ఇక్కడ 'సరస్వతీ నమస్తుభ్యం' ప్రతిధ్వనిస్తుంది. విద్యాతేజం వికసిస్తుంది. ఇక్కడ్నుంచి విద్యార్థులు విజ్ఞానవిత్తులు చేతబూని దారి పొడవునా చల్లుకుంటూ నలుదిశలకూ సాగిపోతారు.

ఎక్కడికెళ్ళినా, ప్రపంచంలోని ఏ మూలకెళ్ళినా వారి గుండెల్లో ఈ జ్ఞాన మట్టి చెమ్మ ఉండి తీరుతుంది.

అందుకు మేమే ప్రత్యక్ష సాక్ష్యం!

* * *

**(రంజని బహుమతి కథలు – 2017)**